సాక్షి కామారెడ్డి

సోమవారం । 2 । జూన్ । 2025



వంద రోజుల యాక్షన్ ప్లాన్
మున్సిపాలిటీల అభివృద్ధి కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో ముందుకు సాగాలని సర్కారు నిర్ణయించింది.
- 8లో ▸



యథేచ్ఛగా కబ్జా..
పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి తండా పరిధిలో అటవీ భూములు కబ్జాకు గురవుతున్నాయి.
- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.3 /23.5

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరమైన, చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీ

కామారెడ్డి క్రైం: జిల్లా రెవెన్యూ శాఖలో బదిలీలు చేపట్టారు. 12 మంది తహసీల్దార్‌లు, డీటీలకు స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సదాశివనగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న గంగాసాగర్‌ను బీబీపేటకు, బీబీపేట తహసీల్దార్ సత్యనారాయణను సదాశివనగర్‌కు పంపించారు. మాచారెడ్డి తహసీల్దార్ శ్వేతను తాడ్వాయికి, భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌ను కామారెడ్డి ఆర్డీవో కార్యాలయ డీఏవోగా, ప్రస్తుతం డీఏవోగా ఉన్న సునీతను భిక్కనూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సరళను మాచారెడ్డి తహసీల్దార్‌గా, నస్రుల్లాబాద్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను డోంగ్లీ మండలానికి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న సువర్ణను నస్రుల్లాబాద్ తహసీల్దార్‌గా, డోంగ్లీ తహసీల్దార్ అనిల్ కుమార్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏవోగా నియమించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ సుధాకర్‌ను దోమకొండ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్‌ను గాంధారి డీటీగా బదిలీ చేశారు. కామారెడ్డి సివిల్ సప్లయ్ డీటీగా ఉన్న కిష్టయ్యను రామారెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లావ్యాప్తంగా నెలాఖరు వరకు పోలీస్ యాక్ట్ 30, 30ఏ అమలులో ఉంటాయని ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఇంటర్ తరగతులు ప్రారంభం

గాంధారి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని గాంధారి కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం తెలిపారు. విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని సూచించారు. పదో తరగతి పాసైనవారు ఇంటర్‌లో అడ్మిషన్ పొందాలని కోరారు. ఆదివారం పలువురు విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.లక్ష్మణ్, జెట్టి విజయ్ కుమార్, లోక శ్రీధర్ తదితులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన నాగమడుగు ఎత్తిపోతల పనులు



అభివృద్ధి అంతంతే!

- తెలంగాణ రాష్ట్రమొచ్చినా తీరని సాగునీటి సమస్య
- ఏళ్లు గడుస్తున్నా ప్రాణహిత 22వ ప్యాకేజీ పనుల్లో పురోగతి కరువు
- ముందుకు సాగని 'నాగమడుగు' పనులు
- నిరుద్యోగులు, కూలీలకు తప్పని వలసలు
- అందని ద్రాక్షగానే ఇంజనీరింగ్ విద్య
- ఎన్నికల హామీగా మిగిలిన ఎల్లారెడ్డి బస్‌డిపో ఏర్పాటు

నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఎన్నో పోరాటాలకు కామారెడ్డి వేదికగా నిలిచింది 1969 నాటి తెలంగాణ ఉద్యమం నుంచి 1997 లో జరిగిన ప్రజాస్వామిక తెలంగాణ పోరాటాలతోపాటు 2001 నుంచి జరిగిన ఉద్యమాల్లో ఈ ప్రాంత ప్రజలు క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఉద్యమంలో ఎంతోమంది అసువులు బాసారు. టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నడిపించిన తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో సబ్బండవర్ణాల ప్రజలు పాల్గొని రాష్ట్రం ఏర్పాటయ్యేదాకా మడమ తిప్పకుండా పోరాడారు. కామారెడ్డిలో రైల్‌రోకో, జాతీయ రహదారుల దిగ్బంధం వంటి సంఘటనలెన్నో పోరాటంలో మైలురాళ్లుగా నిలిచాయి. తెలంగాణ కోసం పలువురు ఆత్మబలిదానాలూ చేశారు. విప్లవోద్యమంలోనూ ఎంతోమంది బలయ్యారు. అందరి ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటికి 11 ఏళ్లు పూర్తవుతోంది. ఈ పదకొండేళ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. ప్రధానంగా సాగునీటి సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగడానికి పారిశ్రామిక ప్రగతి జరగలేదు. రవాణా సౌకర్యాలు మెరుగుపడలేదు. విద్యారంగంలో మెడికల్ కాలేజీ తప్ప మరే కాలేజీలు ఏర్పాటు కాలేదు. ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. అలాగే సాగునీటి సమస్యతో వ్యవసాయం అనుకూలించక, ఉన్న ఊరిలో ఉపాధి దొరక్క చాలామంది గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారు.

మెరుగుపడని రవాణా వ్యవస్థ

జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడలలో ఆర్టీసీ బస్ డిపోలు ఉన్నాయి. ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటైతే జిల్లాలోని పలు ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. కానీ ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు అంశం ఎన్నికల హామీగానే మిగిలిపోయింది.

ఎన్‌హెచ్–44 బైపాస్ రోడ్డు మీదుగా నిత్యం వివిధ ప్రాంతాలకు బస్సులు తిరుగుతాయి. అయితే చాలా బస్సులు జిల్లా కేంద్రంలోకి రావడం లేదు. సాయంత్రం అయ్యిందంటే హైదరాబాద్ నుంచి కామారెడ్డికి రావడానికి బస్సులు సరిగా లేక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో హైవేకు ఆనుకుని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. హైవేపై బస్టాండ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

పారిశ్రామిక అభివృద్ధి నామమాత్రమే..

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్న పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. యువతకు ఉపాధి చూపి, అభివృద్ధికి బాటలు వేసే పరిశ్రమలు రాకపోగా, రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని మాత్రం ఉచితంగా వెదజల్లుతున్నారు. జిల్లాలో ఫుడ్ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన పరిశ్రమలు స్థాపించాలని స్థానికులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో సోయా, మక్క పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. వాటికి సంబంధించిన ఏ ఒక్క పరిశ్రమా ఏర్పాటు కాలేదు. అలాగే ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటు విషయంలోనూ ఎలాంటి ముందడుగు పడడం లేదు.

ఉన్నత విద్య కోసం జిల్లా దాటాల్సిందే..

జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ మాత్రమే ఏర్పాటైంది.. ప్రధానంగా సాంకేతిక రంగానికి సంబంధించి పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీలు లేవు. డీఎడ్, బీఎడ్ కాలేజీలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ఉన్న డెయిరీ కాలేజీని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారు. డెయిరీ సైన్స్‌లో పీజీ కోర్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న సౌత్ క్యాంపస్‌లో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టాల్సి ఉన్నా అడుగులు పడడం లేదు. మాల్తుమ్మెదలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీని అభివృద్ధి చేయాల్సింది పోయి ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. దీంతో ఉన్నత విద్యాభ్యాసం కోసం జిల్లా విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది.

సాగునీరు అందేదెప్పుడో?

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాలకు సాగునీ రందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సా ర్ ప్రాణహిత–చేవెళ్ల పథకంలో భాగంగా 22వ ప్యాకేజీకి అనుమతులు ఇచ్చారు. భూంపల్లి చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి, దాని ద్వారా ఆయా ప్రాంతాల్లో లక్షకు పైచిలుకు ఎకరాలకు సాగు నీరందించేందుకు పథకాన్ని ప్రారంభించారు. అయితే వైఎస్సార్ మరణానంతరం 22 వ ప్యాకేజీ పనులకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. భూసేకరణే పూర్తి స్థాయిలో జరగలేదు. ఇటీవల రూ.23 కోట్లు విడుదల చేసినా అవి ఏ మూలకూ సరిపోవు. ప్రాజెక్టు పూర్తికి కావలసిన నిధులు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సాగునీటి సమస్యతోనే ఈ ప్రాంత రైతులు బోర్లు తవ్వించి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చాలామంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఇప్పటికీ సాగునీటి సమస్యతో సేద్యం అనుకూలించకపోవడంతో రైతులు, రైతు కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు.

జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు సాగునీరందించేందుకు గత ప్రభుత్వంలో నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. అయితే పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంపు, పూడిక తొలగింపు ఎన్నికల హామీలుగానే మిగిలాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడిక పెరిగి ఏడాదికేడాది నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. సాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబడిపోతోంది.



ప్రాణహిత 22వ ప్యాకేజీలో భాగంగా భూంపల్లి వద్ద తవ్విన కాలువ

వన మహోత్సవానికి సన్నద్ధం

- జిల్లాలో 12 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం
- 527 నర్సరీల్లో మొక్కలు సిద్ధం



లింగంపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

సదాశివనగర్ : జిల్లాలో వన మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే 527 నర్సరీల్లో 12 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచారు. ఈనెల మొదటి వారంలో కురిసే వర్షాల ఆధారంగా వీటిని ఆయా గ్రామాలలో నాటడానికి ప్రణాళికలు వెంటనే రూపొందించాలని డీఆర్‌డీవో సురేందర్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎక్కడెక్కడ నాటుతారంటే..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎక్కడ ఎంత శాతం నాటాలన్న విషయమై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రహదారుల వెంట 20 శాతం, సామాజిక, ప్రభుత్వ స్థలాల్లో 20 శాతం, గట్ల వెంట 20 శాతం, ఇంటి ఆవరణలో 15 శాతం, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 10 శాతం, చెరువులు, కుంటలు కట్టల వెంట 5 శాతం, ప్రభుత్వ స్థలాలకు కంచెల కోసం 10 శాతం మొక్కలు నాటాలని సూచించింది.

ఏ ఏ మొక్కలు...

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. గుల్‌మోహర్, టెకోమా, సీమతంగెడు, రేల, కానుగ, స్పాథోడియా, నల్లమద్ది, సీతాఫలం, గన్నేరు, కాగితం, ఈత, వెదురు, మల్లె, మందారం, విరజాజి, గులాబీ, గోరింట, జామ, ద్రాక్ష, అల్లనేరేడు, బొప్పాయి, మునగ వంటి మొక్కలు పెంచుతున్నారు.

లొకేషన్‌లను గుర్తించాలని సూచించాం

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటేందుకు లొకేషన్‌లను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. దాదాపుగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు లొకేషన్‌లను గుర్తించారు. వర్షాలు కురవగానే మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడతాం.
– సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

రేషన్.. పరేషాన్

- మూడు నెలల బియ్యం కోసం ఆరుసార్లు బయోమెట్రిక్
- ఓటీపీ విధానం రద్దుతో దివ్యాంగులూ దుకాణాలకు రావాల్సిన పరిస్థితి
- సతాయిస్తున్న సర్వర్.. ఇబ్బందిపడుతున్న కార్డుదారులు



ఎల్లారెడ్డిలో సర్వర్ సమస్య కారణంగా ముందుకు సాగని బియ్యం పంపిణీ, నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఎల్లారెడ్డిరూరల్: రేషన్ షాప్‌ల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభమైంది. వానాకాలంలో రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల కోటా అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ ఆదివారం మొదలయ్యింది. ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొన్ని దుకాణాలకు సరఫరా కాని బియ్యం

జిల్లాలో 578 రేషన్ దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 2 లక్షల 53 వేల రేషన్ కార్డులకు మూడు నెలల బియ్యం పంపిణీ చేయడానికి 17వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 79 రేషన్ దుకాణాలుండగా ఇప్పటివరకు 65 దుకాణాలకు మాత్రమే గోదాం నుంచి బియ్యం సరఫరా అయ్యాయి. 14 దుకాణాలకు బియ్యం రాకపోవడంతో ఆయా షాప్‌ల పరిధిలో బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు.

మారిన నిబంధనలు..

మూడు నెలల రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు ఉదయమే రేషన్ దుకాణాలకు చేరుకున్నారు. కానీ సర్వర్ సమస్యలతో చాలా సమయం వరకు పంపిణీ ప్రారంభం కాలేదు. దీనికి తోడు నిబంధనలు మారడంతో వినియోగదారులు గంటల తరబడి రేషన్ దుకాణాల ముందు పడిగాపులు కాయాల్సి వచ్చింది. గతంలో బయోమెట్రిక్ మిషన్‌పై ఒకసారి వేలిముద్ర వేస్తే సరిపోయేది. కానీ ఈసారి నిబంధనలు మార్చారు. కేంద్ర ప్రభుత్వం అందించే 5 కిలోల బియ్యంకు ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వం అందించే కిలో బియ్యానికి ఒకసారి వేలిముద్ర వేయాల్సి వస్తోంది. ఇలా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం తీసుకునేందుకు ఒక్కో వినియోగదారుడు ఆరుసార్లు వేలిముద్ర నమోదు చేయాల్సి రావడంతో చాలా సమయం పడుతోంది. అదే విధంగా 5 కిలోలు ఒకసారి, కిలో ఒకసారి మిషన్‌లో బియ్యం తూకం వేయాల్సి వస్తోంది. ఆరుసార్లు బయోమెట్రిక్, ఆరుసార్లు తూకం వేయడానికి చాలా సమయం పడుతోంది.

కుటుంబంలో ఇద్దరు సభ్యులు మాత్రమే ఉంటే గతంలో బయోమెట్రిక్ అవసరం లేకుండా ఓటీపీ ద్వారా కూడా రేషన్ బియ్యం పంపిణీ చేసేవారు. ఈసారి ఆ విధానం రద్దు చేశారు. దీంతో వారు కూడా రేషన్ దుకాణానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మానసిక, శారీరక దివ్యాంగులు సైతం రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్ర పెట్టాల్సిందే..

రవాణా భారం..

ఇంతకుముందు ఏ నెలకానెల పంపిణీ చేసినప్పుడు బియ్యం తీసుకువెళ్లడానికి చాలామందికి రవాణా సమస్య ఏర్పడలేదు. సైకిళ్లపై, బైక్‌లపై తీసుకువెళ్లేవారు. కొంతమంది మోసుకుని వెళ్లేవారు. ఇప్పుడు మూడు నెలలకు సంబంధించిన రేషన్ కావడంతో ఆటో లేదా రిక్షాలను తీసుకుని రావాల్సి వస్తోంది. దూరాన్ని బట్టి వంద రూపాయలనుంచి రూ. 200 వరకు రవాణా భారం పడుతోందని పలువురు రేషన్‌కార్డుదారులు పేర్కొంటున్నారు.



ఓటీపీ విధానం తొలగించడంతో రేషన్ దుకాణానికి వచ్చిన మానసిక దివ్యాంగురాలు

ఏనెలకానెల ఇవ్వాలి



మూడు నెలల బియ్యం ఒకేసారి అందించడం సరికాదు. మూడు నెలలకు సంబంధించిన బియ్యం తీసుకువెళ్లడానికీ ఇబ్బందిగా ఉంటుంది. నెలనెలా బియ్యం ఇస్తేనే బాగుంటుంది. – సుజాత, ఎల్లారెడ్డి

రవాణా భారం అవుతోంది



మాకు నెలనెలా 24 కిలోల బియ్యం వస్తాయి. ఇప్పుడు 3 నెలలకు సంబంధించి 72 కిలోలు రావడంతో వాటిని తీసుకువెళ్లడానికి ఆటో కిరాయి తీసుకోవాల్సి వచ్చింది. రూ. 200 భారం పడింది. – దుర్గవ్వ, తిమ్మాపూర్

నిబంధనలు మార్చారు




గతంలో ఒకసారి వేలిముద్ర వేస్తే సరిపోయేది. ఈసారి నిబంధనలు మార్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కోటాలకు వేరు వేరుగా బయోమెట్రిక్ తీసుకుంటున్నాం. అలాగే బియ్యం కూడా వేరువేరుగా తూకం వేయాల్సి వస్తోంది. సర్వర్ కూడా సతాయిస్తుండడంతో సమయం వృథా అవుతోంది.
– నరేందర్, రేషన్ డీలర్, ఎల్లారెడ్డి

రాష్ట్ర స్థాయి సేవా పతకాలకు ఎంపిక



ఎస్.శ్రీనివాస్, సీసీఎస్ సీఐ



లింగయ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

కామారెడ్డి క్రైం: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి అవార్డులను ప్రకటించింది. జిల్లాలో 17 మంది అవార్డులకు ఎంపికయ్యారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కే.లింగయ్య ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. సీసీఎస్ సీఐ ఎస్.శ్రీనివాస్, భిక్కనూర్ ఎస్సై దత్తాత్రి గౌడ్, ఏఆర్ ఎస్సై సత్యనారాయణరెడ్డి, దోమకొండ ఏఎస్సై సుబ్రహ్మణ్యం చారి, కామారెడ్డి ఏఎస్సై ఏ.శ్రీనివాస్, మాచారెడ్డి ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, బిచ్కుంద ఏఎస్సై శంకర్, రామారెడ్డి పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.నారాయణ, సత్యం గౌడ్, శ్రీధర్, కామారెడ్డి హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌రావు, గాంధారి హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ కిషన్, లింగంపేట కానిస్టేబుల్ దేవేందర్, మద్నూర్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు



ముువ్వన్నెల కాంతుల్లో కలెక్టరేట్

- ముఖ్య అతిథిగా రానున్న టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో అధికారులు ఏర్పాట్లు చేశారు. వేడుకలకు తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని అధికారులు తెలిపారు. ఆయన ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పురోగతిపై ప్రసంగిస్తారన్నారు. ఆవిర్భావ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శకటాల ప్రదర్శన ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, భూ భారతి ఉత్తర్వులు అందిస్తారని పేర్కొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో చేసిన ఏర్పాట్లు


కార్పొరేట్ శక్తుల కోసమే మానవ హననం

- తెరవే జిల్లా మహాసభల్లో విమలక్క

కామారెడ్డి అర్బన్ : దేశంలోని సహజ వనరులు, అటవీ సంపదలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం మానవ హననానికి పూనుకుందని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ నాయకురాలు విమలక్క ఆరోపించారు. శత్రు దేశం పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం.. దేశంలోని తమ బిడ్డలతో చర్చలు జరపడానికి సిద్ధంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక(తెరవే) కామారెడ్డి జిల్లా రెండో మహాసభను ఆదివారం జిల్లాకేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలు పాలకుల కుట్రలను బట్టబయలు చేయాలని కోరారు.

ప్రజల గొంతుక తెరవే

తెలంగాణ రచయితల వేదిక ప్రజల గొంతుకగా నిలబడిందని ఆచార్య జయధీర్ తిరుమలరావు పేర్కొన్నారు. తెరవేను నిషేధించాలని పాలకులు చూసినా వెనకడుగు వేయలేదని, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసుకుంటూ పోతోందని పేర్కొన్నారు. కవులు, రచయితలు, కళాకారుల మౌనం దేశానికి ప్రమాదన్నారు. ఆద్యకళను రక్షించడానికి శాశ్వత మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వం, భాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణకు తెరవే కృషి చేస్తోందని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి పేర్కొన్నారు. మహాసభల్లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కవులు, రచయితలు పరిశీలించారు. తెరవే ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అమరులైన కవులు, రచయితలను గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు. మహాసభల్లో తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రచయితలు గాజోజు నాగభూషణం, భూర్ల వెంకటేశ్వర్లు, ఉదారి నారాయణ, జి.లచ్చయ్య, ఆడెపు లక్ష్మణ్, ప్రేమ్‌లాల్, నారాయణగౌడ్, సీపీ కుమార్, తోకల రాజేశం, పబ్బ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల్లో ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న తిరుమలరావు, విమలక్క, కవులు

క్లుప్తంగా

ఆవులకు లంపి స్కిన్ వ్యాధి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్, శివాలయం, పాంచ్‌రస్తా తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆవులకు లంపి స్కిన్ వ్యాధి సోకింది. వారం రోజుల క్రితం ఒకే ఆవుకు సోకడంతో ప్రస్తుతం చాలా ఆవులకు ఈవ్యాధి వ్యాపించింది. వీక్లీమార్కెట్‌లోనే పశు వైద్యశాల ఉన్న వైద్యులు పట్టించుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈఆవులకు వ్యాధి నివారణ, వ్యాప్తి చెందకుండా టీకాలు, చికిత్సలు అందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై మండల పశువైద్యాధికారి రవికిరణ్‌ను సంప్రదించగా పట్టణంలో సంచరిస్తున్న పశువులను పరిశీలించి చికిత్స అందిస్తామన్నారు. తగిన టీకాలు వేస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీ



లింగంపేట: మండలంలోని ముస్తాపూర్ శివారులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెంట్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ఏఎస్సై ప్రకాశ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఏఎస్సై నర్సయ్య వాహనాల తనిఖీ చేపట్టారు. పెండింగ్ చలాన్‌లు లేకుండా చూసుకోవాలని వాహనదారులకు సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ సత్యం, సిబ్బంది నర్సింలు, ఇసాక్, గాజీరాం తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు

పిట్లం: పిట్లం శివారులోని జాతీయ రహదారిపై ఎస్సై రాజు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

- రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం కృషి
- చెరుకు, వరిలో నూతన వంగడాలు సృష్టి

రుద్రూర్: రైతులకు వ్యవసాయంలో అవసరమగు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు కొత్త వంగడాలను రూపొందించి రైతులకు అందించడానికి 1935లో రుద్రూర్ చెరుకు, వరి ప్రాంతీయ పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేశారు. కాలానుగుణంగా నాటి నుంచి ఎన్నో చెరుకు, వరి వంగడాలు రూపొందించి రైతులకు పరిచయం చేశారు. చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు సాధించే వంగడాల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. కొత్తగా తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడినిచ్చే చెరుకు, రెండు వరి వంగడాలను రూపొందించి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మూడు కొత్త వంగడాలు గూర్చి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ అంజయ్య ఆయన మాటల్లో..



డాక్టర్ అంజయ్య

రుద్రూర్ చెరుకు-81 రకం

ఇది గతేడాది రుద్రూర్ పరిశోధన స్థానం నుంచి విడుదల చేయబడ్డ మధ్యస్థ చెరుకు రకం. రాష్ట్రంలో సాగు నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు అనుకూలమైనది. ఎర్ర కుళ్లు తెగులు, కొరడా తెగులు, పసుపు ఆకు తెగులు కొంత వరకు తట్టుకుంటుంది. పీర పురుగు, కాండం తొలుచు పురుగు, పొలుసు పురుగును తట్టుకుంటుంది. దిగుబడి హెక్టారుకు 125.5 టన్నులు వస్తుంది. బెల్లం దిగుబడి 16.47 టన్నులు. 19.4శాతం సుక్రోస్ కల్గి ఉంటుంది.



రుద్రూర్ చెరుకు ఆర్-81

రుద్రూర్ వరి ఆర్‌డీఆర్-1200

ఈ రకాన్ని జగిత్యాల్ సాంబ(జేజీఎల్-3844), నెల్లూర్ మసూరి(ఎన్ఎల్ఆర్-344449) అనే రకాలను రూపొందించారు. లక్షణాలు: వాన కాలంలో సాగుకు అనువైన మధ్య కాలిక రకం. 130-135 రోజుల్లో పంట చేతికి వస్తుంది. సన్న గింజ కలిగి తక్కువ నూక శాతంతో అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. కాండం బలమైనది. పైరు చేను మీద పడిపోదు. సుడి దోమ, ఉల్లి కోడును కొంత వరకు తట్టుకుంటుంది. ఎకరానికి సుమారు 32-34 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.



వరి ఆర్‌డీఆర్-1200

రుద్రూర్ వరి ఆర్‌డీఆర్-1162

ఇది స్వల్ప కాలిక రకం. రెండు కాలలకు అనువైనది. వాన కాలంలో 120-125 రోజులకు, యాసంగిలో 130-135 రోజులకు పంట చేతికి వస్తుంది. మిక్కిలి సన్న గింజ రకం. ఎకరాకు సుమారుగా వాన కాలంలో 32, యాసంగిలో 34 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. తక్కువ నూక శాతం ఉంటుంది. కంకినల్లి, ఉల్లికోడు, ఆకు తెగులు, మెడ విరుపు తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. గంగా కావేరి కన్నా అతి సన్న గింజ కలిగి ఉంటుంది. అన్నం మంచి నాణ్యతను, రుచిని కలిగి ఉంటుంది. ఈ రకం 7-10 రోజుల నిద్రావస్థ కలిగి ఉన్నందున కోసిన ధాన్యాన్ని వెంటనే విత్తనంగా వాడు కోవాలంటే బాగా ఎండబెట్టిన తర్వాత మొలక శాతాన్ని పరీక్షించి నారు పోసుకోవాలని పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ అంజయ్య వివరించారు. పరిశోధనలు జరిపి శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వరి రకాలను రైతులు సాగు చేసి లబ్ధి పొందాలని ఆయన కోరారు.



వరి రకం ఆర్‌డీఆర్-1162

లైసెన్స్ రెన్యువల్ ఈజీగా చేసుకుందాం ఇలా..

మీకు తెలుసా?



ఒకసారి తీసుకున్న డ్రైవింగ్ లైసెన్స్ గడువులోగా రెన్యువల్ చేసుకోవడం చాలా మంది మరిచిపోతుంటారు. గడువు తీరిన 30 రోజుల్లోపు రెన్యువల్ చేయించుకోకుంటే జరిమానా విధిస్తారు. మరీ ఎక్కువ రోజులైతే రద్దు చేసే అవకాశం ఉంది.

- గతంలో ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వచ్చేది. https:// transport. telangana. gov. in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈజీగా రెన్యువల్ చేసుకోవచ్చు.
- ముందుగా రవాణాశాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లైసెన్స్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ ఎంచుకుంటే మరో పేజీ ఓపెన్ అవుతుంది.
- అందులో కింద ఉండే రెన్యువల్ ఆఫ్ డ్రైవింగ్ లైసెన్స్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత క్లిక్ హియర్ టు బుక్ ది స్లాట్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- మరో కొత్త విండోలో కనిపించే డ్రైవింగ్ లైసెన్స్ బాక్స్‌లోని రెన్యూవల్ ఆఫ్ లైసెన్స్ తర్వాత కంటిన్యూ స్లాట్ బుకింగ్‌ని క్లిక్ చేయాలి.
- తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ నంబరు, ఎక్కడ ఇచ్చారు, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు తదితర వివరాలు నమోదు చేయాలి.
- రిక్వెస్ట్ ఓటీపీని క్లిక్ చేస్తే మన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- దానితో పాటు క్యాప్చర్‌ను ఎంటర్ చేసి గెట్ డీటైల్స్‌పై నొక్కగానే వివరాలన్ని కనిపిస్తాయి.
- జాగ్రత్తగా పరిశీలించి కన్‌ఫం క్లిక్ చేయాలి. తర్వాత పేమెంట్ ఆప్షన్ ద్వారా రుసుం చెల్లించాలి.
- ప్రింట్ తీసుకుని నిర్దేశించిన తేదీ రోజు ఒరిజినల్ లైసెన్స్, గుర్తింపు కార్డుతో ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి.
- అక్కడ అధికారులు పరిశీలించి డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేస్తారు.

– కామారెడ్డి టౌన్

నారుమడిలో..

నిజాంసాగర్: ముందస్తుగా వర్షాలు కురియడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని భూములు సిద్ధం చేసుకున్న రైతులు.. వరి సాగు కోసం నారు పోస్తున్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ శివారులో రైతులు వరి నారు పోస్తుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.



గున్కుల్ శివారులో వరి విత్తనాలు చల్లుతున్న రైతులు

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు

- అర్ధరాత్రి వేళ వాహనాల్లో తరలిస్తున్న వైనం
- గోశాలలకు అప్పగింత

నిజాంసాగర్(జుక్కల్): గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వ పరంగా పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినా గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్టపడటం లేదు. రాత్రి వేళల్లో ట్రక్కులు, డీసీఎంలు, ఐచర్ వాహనాల్లో గోవులను గోవధశాలలకు తరలిస్తున్నారు. మహమ్మద్ నగర్ మండలం బొగ్గ గుడిసె చౌరస్తా వద్ద శనివారం అర్ధరాత్రి డీసీఎం వాహనంలో గోవులను అక్రమంగా తరలిస్తుండగా స్థానిక బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. సదరు వాహనాన్ని బీజేపీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో వెంబడించి వాహనాన్ని పట్టుకున్నారు. సదరు వాహనంలో 9 ఎద్దులు ఉండటంతో పోలీసులకు బీజేపీ కార్యకర్తలు సమాచారం అందించారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 9 ఎద్దులను తిర్మలాపూర్ గోశాలకు తరలించారు.



తిర్మలాపూర్ గోశాలకు అప్పగించిన ఎద్దులు

అచ్చంపేట వద్ద 26 గోవులు

నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామం నుంచి శనివారం అర్ధరాత్రి వేళ ట్రక్కులో తరలిస్తున్న 26 గోవులు(ఎద్దులు)లను బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ట్రక్కు వాహనాన్ని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, బీజేపీ కార్యకర్తలు సదరు ట్రక్కులో గోవులను శాంతాపూర్ గోశాలకు తరలించారు. పట్టుబడిన గోవులు, ఎద్దులను గోశాల నిర్వాహకులకు అప్పగించారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్



బాన్సువాడ మున్సిపాలిటీలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్న అధికారులు, మెప్మా సిబ్బంది

- బల్దియాల్లో ప్రణాళిక రూపొందించిన అధికారులు
- అభివృద్ధి పనుల పూర్తి, రుణాలు ఇప్పించడం, కొత్త పొదుపు సంఘాల ఏర్పాటు లక్ష్యం
- నేటి నుంచి ప్రారంభం

బాన్సువాడ : మున్సిపాలిటీల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సోమవారం నుంచి యాక్షన్ ప్లాన్ ప్రారంభించాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు అన్ని మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీల్లో మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించడం, నర్సరీల్లో ఉన్న మొక్కల వివరాలు, ఎక్కడ పంపిణీ చేయాలి. ఎక్కడ నాటాలి అనే వివరాలు నమోదు చేశారు. అదే విధంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం, చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేయడం లాంటివి చేయనున్నారు. వార్డుల్లో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఆస్తి పన్ను తప్పుఒప్పులను సవరించడం లాంటి కార్యక్రమాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

అక్రమ నల్లా కనెక్షన్ల గుర్తింపు..

ఇంజినీరింగ్ విభాగం అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు పూర్తి చేయడంతో పాటు వార్డుల్లో అక్రమ నల్లా కనెక్షన్లను గుర్తించడం, క్రమబద్ధీకరించడం, లేదా తొలగించడం లాంటివి చేపట్టాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు ఆస్పత్రుల యాజమాన్యాల సహకారంతో కార్మికులకు వైద్య శిబిరాలు చేపట్టాలి. పార్కుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన పనుల వివరాలను ఆయా మున్సిపాలిటీలు తేదీల వారీగా జాబితా రూపొందించే పనిలో పడ్డారు.

కొత్తగా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు..

మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులను గుర్తించడం, వారికి రుణాలు ఇప్పించడం, కొత్త పొదుపు సంఘాలను ఏర్పాటు చేయడం లాంటివి చేపట్టాలి. వీటితో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన సంఘాలకు రుణాలు ఇప్పించడం, కొత్తగా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ల ఏర్పాటు దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నివేదిక సిద్ధం చేశాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 2 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అన్ని విభాగాల ఉద్యోగులు చేయాల్సిన పనులు గుర్తించి వాటిని పూర్తి చేస్తారు. ఇందుకు సంబంధించి అన్ని వివరాలతో నివేదిక సిద్ధం చేశాం.

– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

అల్లుకున్న అనుబంధాలు.. ఆత్మీయత



బాన్సువాడ జెడ్పీహెచ్ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



తాండూర్ జెడ్పీహెచ్ఎస్ 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



మద్నూర్ 1998-99 ఎస్సెస్సీ విద్యార్థులు



పెద్దమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



కామారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1983-84 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



గోపాల్‌పేట 2004-05 ఎస్సెస్సీ విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

గోమాతలను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి



పిట్లం(జుక్కల్): అక్రమంగా గోమాతలను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం పిట్లం పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా అక్రమంగా గోమాతలను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get International Capital Market Trading, Profit Sharing/Fixed Profit Safe & Secure. Ph : 9392151984. [SCA25004324]

BUSINESS SERVICES

■ సిరి అసోసియేట్స్ హౌస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ రేకుల & గుణ పెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25003998]

REAL ESTATE

LEASE / RENT

■ ఆర్మూర్‌లో టిప్స్ మాజిద్ రోడ్ హుస్నాబాద్‌గల్లి 45x45 SFT (8 మడిగెల స్థలం ముందు కాలిస్థలం గేట్ అటాచ్ బాత్రూమ్) గల మడిగే కిరాయికి ఇవ్వబడును. ఆర్మూర్ సంప్ర: 7382905254. [SCA25004359]

WANTED

FACULTY TEACHERS

■ Wanted Teachers to Teach Nursery - 7th E/M for all Subjects, Computer Operator, Abacus, PET, Vice Principal, Incharges, Principal (English) Cont: Saloora (Bodhan) 98483 78237. [SCA25004416]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన ఆర్ చిన్న సాయిలును పొలం విషయమై ఘర్షణ పడి దాడి చేసిన నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నాన్నమ్మ పొలం విషయంలో చిన్న సాయిలు సోదరుని కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి తిట్టడంతో పాటు కొట్టారని బాధితుడి కుమారుడు సాయి కిరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

బోధన్: మండలంలోని ఓ గ్రామంలో బాలిక వివాహాన్ని అధికారులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. నిర్మల్ జిల్లా భైంసా మండల కేంద్రానికి చెందిన యువకుడితో సోమవారం ఉదయం గ్రామంలో వివాహానికి ఇరు కుటుంబాలు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకొని కుటుంబీకులతో చర్చించారు. బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికను బాలసదన్‌కు తరలించారు. మీడియేషన్ సెంటర్ ప్రతినిధి పద్మాసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఐసీసీఎస్ టీం సభ్యులు సౌజన్య, సాయిలు, స్వప్న తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

గాంధారి: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన గాంధారి మండలం బూర్గుల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి భూమయ్య తన గేదెలను మేపడానికి శివారులలోని వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లాడు. విద్యుత్ స్తంభం వద్ద సపోర్ట్ వైర్‌కు గేదె తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరాడు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని మేజర్‌వాడి గ్రామశివారులో మేతకోసం వెళ్లిన ఓ ఆవు ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. గ్రామంలోని కోడె లక్ష్మయ్యకు చెందిన ఆవు రోజూమాదిరిగానే మేతకోసం గ్రామశివారుకు వెళ్లింది. గ్రామ శివారులోని ఎస్ఎస్ నం 39 వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సంభవించి ఆవు మృత్యువాత పడింది. ఆవు విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం బాధితునికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నందిపేట్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన నందిపేట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాయాపూర్ గ్రామానికి చెందిన మేకల మురళి పని నిమిత్తం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో అతని ఎడమ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్, జంగం వికాస్, బ్రహ్మాజివాడి గ్రామానికి చెందిన శాల భరత్ వేర్వేరుగా తమ బైక్‌లపై కామారెడ్డి నుంచి తమ గ్రామాలకు కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వస్తుండగా కృష్ణాజివాడిలోకి రాగానే ప్రమాదవశాత్తు ఒకదాని వెంట ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని వివరాలు సేకరించారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం గర్గుల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటికాడి నర్సింలు(45) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. అతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం కుమార్తెకు వివాహం చేయగా అప్పుల య్యాయి. దీనికి తోడు ఆటో సరిగ్గా నడవక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మానసికంగా కుంగిపోయేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం నిర్మాణంలో ఉన్న గంగపుత్ర సంఘం భవనం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి రెండో భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



కార్తీక్‌రావు మృతదేహం

సదాశివనగర్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన కార్తీక్‌రావు(24) కామారెడ్డి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఘటన స్థలిలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సుబ్బారావు మృతి



మాక్లూర్: రాష్ట్ర, జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు మైనేని సుబ్బారావు (59) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన పుట్టి పెరిగింది కొత్తపల్లి గ్రామంలోనే. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆ క్రమంలోనే కబడ్డీ కోచ్‌గా నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతూ వచ్చారు. ఈయన మృతిపై ఆయా క్రీడా కోచులు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు జిల్లా కేంద్రంలో నిర్వహించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారు మాధవనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (45) ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై హెచ్ సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాధవనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి సికింద్రాబాద్ నుంచి ముంబై వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శనివారం రాత్రి నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ హరికృష్ణ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి కోరారు.